"కాదు..మన వేణుకి తగిలింది. ఆ..ఆ 'సన్‌స్ట్రోక్ కాదు, ఈ సన్‌స్ట్రోక్' అంటూ వేణుకొడుకు అనూప్‌ని చూపించాడు.

షణ్ముఖరావుకి తల తిరిగినట్టనిపించింది. "ఈ..ఈ సన్‌స్ట్రోకా?" అన్నాడు అయోమయం, ఆశ్చర్యం కలబోసిన స్థితిలో.

"ఈమధ్యకాలంలో ఆ సన్‌స్ట్రోక్‌ల కన్నా, ఈ సన్‌స్ట్రోక్‌లు తల్లిదండ్రులకు బాగా తగులుతున్నాయి. మారిన కల్చర్, సినిమాల ప్రభావంతో పిల్లలు ప్రేమలని, విదేశాలకు వెళ్ళిపోవటమని, కేసుల్లో ఇరుక్కోవటమని, ఏదో రూపంలో తల్లిదండ్రులకు షాక్‌లు, స్ట్రోక్‌లు ఇస్తున్నారు. మన వేణుగాడి కొడుకు ఎవరో అమ్మాయిని ప్రేమిస్తున్నానని పెళ్ళి చేసుకుంటానని చెప్పేసరికి, అప్పటికే తన చెల్లెలి కూతురితో నిశ్చయతాంబూలాలు పుచ్చుకున్న వేణుగాడికి హార్ట్‌ఎటాక్ వచ్చింది. ఈ సన్‌స్ట్రోక్‌తో మనోడు హాస్పిటల్‌లో జాయినయ్యాడు" వివరించాడు మనోహర్.

షణ్ముఖరావుకి తన కొడుకు రాజేష్ గుర్తుకొచ్చాడు. 'నాకూ భవిష్యత్‌లో సన్‌స్ట్రోక్ తగులుతుందా?' మనసులోనే అనుకున్నాడు.

'ఆ సన్‌స్ట్రోక్' తప్పించుకునేందుకు అనేక మార్గాలున్నాయి. 'ఈ సన్‌స్ట్రోక్'ని తప్పించుకునే మార్గాలున్నాయా?

-జె.సునీల్ (హైదరాబాద్)

000

# ఏది ముఖ్యం?



ప్రవీణ్ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే వాళ్ళబ్బాయి చింటూ "నాన్నా, నాన్న..నాకు ఈరోజు ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు కారు బొమ్మ తెస్తాను అని చెప్పావుకదా! ఏది" అని ముద్దు ముద్దుగా అడిగాడు. దానికి ప్రవీణ్ "రేపు తెస్తాను" అని చెప్పి లోపలికి వెళ్ళాడు. ఇంతలో ప్రవీణ్ భార్య హేమ వాళ్ళబ్బాయి చింటూ చిన్నబుచ్చుకున్న సంగతి గమనించి "రేపు తప్పకుండా కొని తెస్తారులేరా" అని ఎత్తుకొంది.

డ్రెస్ మార్చుకొని హాలులోకి వస్తున్న ప్రవీణ్‌తో ఎందుకండీ కారు బొమ్మ తేలేదు అని తన కొడుకు బుగ్గలు నిమురుతూ అడిగింది.

అప్పుడు ప్రవీణ్ చింటూని తన చేతులలోకి తీసుకొని "చింటూ నేను ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు షాపుకి వెళ్ళటం మర్చిపోయానురా! అందుకని మనం ఒక పని చేద్దాము. నీకు ఏం కావాలో ఒక బుక్ పెట్టి రాయి. అందులో నీకు ఏమి కావాలో గుర్తువచ్చినప్పుడల్లా, నీకు కొనుక్కోవాలి అనుకున్నప్పుడల్లా రాయి. నేను రోజు ఆఫీసుకు వెళ్ళేటప్పుడుదల్లా ఆ బుక్ ఓపెన్ చేసి చూసి నీకు కావలసినవి తెస్తాను. అని చెప్పి ఓ.కె.నా గుడ్ బై" అని చెప్పాడు. దానికి చింటూ మొహం వెలిగిపోయింది.

చింటూ వెంటనే వెళ్ళి ఒక పుస్తకాన్ని తీసుకొని వాళ్ళ అమ్మ దగ్గరకు వచ్చాడు. "ఏమిట్రా" అని వాళ్ళమ్మ అడిగింది. డాడి "నీకు కావలసినవి ఒక బుక్ పెట్టి రాయి అని చెప్పాడుగా..నువ్వు రాయి" అని అడిగాడు. దానికి వాళ్ళమ్మ "ఏవి రాయమంటావు?" అని అడిగింది. దానికి వాడు "రెడ్ కార్" అని చెప్పాడు. దానికి హేమ నవ్వుకొని "సరేరా" అని రాసింది. వెంటనే చింటూ "మమ్మి, మమ్మి" చాక్లెట్లు, పెన్, పెన్సిల్ ఇంకా బాల్, బ్యాట్, వాచ్ ఇలా చెబుతూంటే "చాలురా ఇవి తేనీ తరువాత రాద్దాము' అంది. సరేలే అన్నట్లు వాళ్ళ అమ్మ వంక చూశాడు. ఇక రాత్రయింది. ఆ బుక్‌లో ఏమి రాయాలి అన్న ఆలోచనలు వాడికి బాగా పెరిగాయి. పగలంతా వాళ్ళ అమ్మతో అవి రాయి, ఇవి రాయి అని చెబుతూనే ఉన్నాడు. వాళ్ళ అమ్మ నవ్వుకుంటూ సహనంగా రాస్తూనే ఉంది. మరుసటి రోజు వాళ్ళ నాన్న ఆఫీసు నుంచి వచ్చినా వీడు పట్టించుకోలేదు. వాళ్ళనాన్న ఒక రోజు వాడిని పిలిచి ఇందులో "ఇన్ని రాశావు? రేపు ఏది తెమ్మంటావు?" అని అడిగాడు. వాడు ఆలోచనలో పడిపోయాడు. కొంచెం సేపు ఆలోచించి "ఇప్పుడు ఏమీ వద్దు రేపు చెబుతాను" అని అన్నాడు.

దానికి దంపతులిద్దరూ నవ్వుకున్నారు. చింటూ పెరిగి పెద్దవారయ్యాడు. కాలానుగుణంగా వాడిలో మార్పు వాడి కోరికలలో మార్పు వచ్చింది. ఈరోజు ఇది ముఖ్యం అనిపించినది రెండు రోజుల తర్వాత అది ముఖ్యం కాకుండా పోతున్నాయి. తల్లిదండ్రులు వాడికి అవసరమైనవి సమకూరుస్తూనే ఉన్నారు. నెలకొకసారి వాళ్ళ నాన్న ఇందులో ఏది కొనిపెట్టను? అని అడిగినప్పుడల్లా వాడు అయోమయంలో పడేవాడు. "ఏరా ఇది ఈరోజు తెచ్చేయనా అని అడిగితే వద్దు ఆలోచించి చెబుతాను" అనేవాడు. ఇంటర్ అయ్యింది. ఇంజనీరింగులో సీటు వచ్చింది. హాస్టలుకి వెళ్ళాలి అని అనుకున్నాడు. (చదువుకోవదానికి). బైక్‌కొనమని బుక్‌లో రాశావు కదా! బైక్ కొనమంటావా? అని వాళ్ళ నాన్న అడిగాడు. "హాస్టలుకు వెళుతున్నాను కదా? చదువైనాక కొనుక్కుంటాను" అని అన్నాడు. కాలం గడిచింది. చింటూ పెద్దవాడైనాడు. ఉద్యోగం వచ్చింది. వాళ్ళ నాన్న "బైక్ కొనివ్వనా?" అని అడిగాడు.

"వద్దు లోన్ తీసుకొని కొనుక్కొంటాను" అని చెప్పాడు. చింటూకి ఆ బుక్ చూసినప్పుడల్లా బాగా నవ్వు వస్తుంది. చిన్నప్పుడు నేను ఎన్ని కోరికలు కోరేవాడిని బాగా నవ్వుకొంటాడు. అందులో తన బాల్యం, యవ్వనం అన్నీ తన ప్రవర్తనా తన ఆలోచన అన్నీ స్పష్టంగా కనబడతాయి. తల్లిదండ్రులు అనేవారు పిల్లలకి అడిగిందల్లా కొనిపెట్టకుండా వాటి ప్రాముఖ్యతను, అవసరాన్ని చెప్పకుండానే చెప్పినట్లవుతుంది; ఆ బుక్ చూసినప్పుడల్లా, తన తల్లిదండ్రులు ఎంత గొప్పవారో ఆ బుక్ చూసినప్పుడల్లా చింటూ ఆనందపడుతుంటాడు.

-మాధురీరామ్ (హైదరాబాద్)